


# కరపత్రం

SINCE 2014

ఆదివారం ఆగస్ట్ 31 2025 సంపుటి :0 సంచిక :315 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

# సురవరం సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: పేదల జీవితాలలో మార్పు రావాలని.. వారి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని కొనియాడారు. సమాజంలో అనాగరికాలు రూపుమాపేలా ఆయన ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టారన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం హాజరయ్యారు.

"మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యంగెస్ట్ ఎంపీ. సురవరం సుధాకర్‌రెడ్డి గుర్తింపు, ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. ప్రజల తరపున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరపున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారు" అని సీఎం వ్యాఖ్యానించారు.




సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం, బిసి బిల్లుపై నేడు చర్చ



### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై ఆదివారం నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

శాసనసభ వ్యవహారాల కమిటీ- (బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలని శ్రీధర్‌బాబు తెలిపారు. అయితే బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

## తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

- రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని తీర్మానం
- సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు అంగీకారం
- ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీనల పేర్లు సిఫార్సు

తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

2లో ▸

## రెండు రోజులంటే ఎలా

- కాళేశ్వరంతో చర్చకే ప్రాధాన్యం
- వరదలపై చర్చిద్దామంటే బురదరాజకీయం
- అందుకే బిఏసి నుంచి వాకౌట్ చేశాం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం అంటోందని, ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదల గురించి చర్చిద్దామంటే బురద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు- నిర్వహించాలని బీఏసీలో కోరాం. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకుపైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరాం అని హరీశ్‌రావు తెలిపారు. వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది.

2లో ▸

# యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన



- కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ
- సచివాలయం ముందు ఆకస్మిక ధర్నా
- కెటిఆర్, హరీష్ తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు- వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించు కుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. తాము రాజకీయాల కోసం రాలేదని.. రైతుల కోసం వచ్చినట్లు- పేర్కొన్నారు. యూరియా కోసం వెళ్తే రైతులపై దాడి చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొరత సమస్యపై ఒక్కరోజైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలకు కష్టాలు మొదలైన సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు రైతులకు అండగా నిలుస్తూ.. వారి పక్షాన బీఆర్ఎస్ నేతలు పోరాడుతూనే ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. ఇవాళ కూడా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతను తక్షణమే తీర్చాలంటూ రైతుల తరపున బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించామని అన్నారు.


ఆ తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయం ప్రధాన గేటు- వద్ద బైఠాయించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ దోషం - రైతన్నకు మోసం అంటూ నినాదాలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

## ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టులు



2లో ▸

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. బాసర ఆలయం వరకు వరద నీరు



2లో ▸

నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 31 2025

# సంపాదకీయం

## 130 రాజ్యాంగ సూత్రాలకు సమాధి

రాజ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది. ఆ అధికరణ లోని నిబంధన 2, ఇతర విషయాలతో పాటు ఇలా ఉన్నది: 'రాజ్యాంగంలో ఏమి పేర్కొన్నప్పటికీ ఈ రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే, లేక మార్పు చేసే, లేక తొలగించే రాజ్యాంగబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉంటుంది. రాజ్యాంగ సవరణ విధానం ఈ క్రింద ఉదహరింపబడిన విధంగా ఉంటుంది. "రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో గాని, లేక రాజ్యసభలో గాని మాత్రమే ప్రవేశపెట్ట వలెను. ఆ బిల్లును సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదించవలెను. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో సగం కన్న ఎక్కువగా ఉండవలెను. లోక్‌సభలోను, రాజ్యసభలోను ఇదే విధంగా ఆమోదింపవలెను. ఆ విధంగా రెండు సభలు ఆమోదించిన తరువాత ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవలెను. రాష్ట్రపతి ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించవలెను. అప్పుడు బిల్లులో ఉదహరింపబడిన విధంగా రాజ్యాంగం సవరింపబడుతుంది".

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందగల సంఖ్యా బలం ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ లేదు. లోక్‌సభలో ఎన్డీఏ సభ్యులు 293 (మొత్తం సభ్యుల సంఖ్య 543) మంది మాత్రమే కాగా రాజ్యసభలోనూ పాలక కూటమికి కేవలం 133 మంది సభ్యులే (మొత్తం సభ్యుల సంఖ్య 245) ఉన్నారు. ఏ సభలో నైనా ఒక బిల్లు ఆమోదం పొందాలంటే, సభ్యులు అందరూ సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటువేసినప్పుడు మాత్రమే అది చట్ట ప్రతిపత్తి పొందడానికి అర్హమవుతుంది (ఓటింగ్‌కు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ సవరణ బిల్లును ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య మొత్తం సభలోని స్థానాలలో సగం కన్నా ఎక్కువగా ఉండాలి. ఉదాహరణకు ఒక సభలో మొత్తం సభ్యుల సంఖ్య 300 అనుకుందాం. సభకు 150 మంది హాజరయినారు. వారిలో 100 మంది ఆ సవరణను ఆమోదించారు. అయినా ఆమోదించినట్లు కాదు. ఎందుకంటే ఆ సవరణ మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదం పొందలేదు కనుక. సభకు కనీసం 200 మంది హాజరై వారిలో 151 మంది ఆ సవరణను ఆమోదిస్తే సభ ఆమోదం పొందినట్లుగా పరిగణితమవుతుంది. ఉభయ సభలలోను ఇదే విధంగా ఆమోదం పొందాలి. ఇలా ఏ సభలోను ఆమోదం పొందలేక పోతే రాజ్యాంగ సవరణ వీగిపోయినట్లే). అయితే ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు అవసరమైన మెజారిటీ పాలక ఎన్డీఏకు ఏ సభలోనూ లేదు.

ప్రతిపక్షాలు అన్నిటికీ కలిపి లోక్‌సభలో 250 మంది సభ్యులు, రాజ్యసభలో 120 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కనుక ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఏ సభలోను ఆమోదం పొందలేదు. లోక్‌సభలో 182 మంది సభ్యులు, రాజ్యసభలో 82 మంది సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే అది ఆమోదం పొందదు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రతిపక్షాలు అన్నీ ఎన్డీఏకు వ్యతిరేకంగా లేవు. వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, భారత రాష్ట్ర సమితి, బహుజన్ సమాజ్ పార్టీ, ఇంకా కొన్ని చిన్న పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతునిస్తున్నాయి. ఏఐటీసీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీఏను వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇండియా కూటమికి వాటి మద్దతు అంశాల ప్రాతిపదికన ఉంటుంది. ఈ పరిస్థితులలో ఎన్డీఏ ప్రభుత్వం 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు%-%2025'ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వెన్వెంటనే ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు నివేదించారు. చాలా సరళంగా కన్పిస్తున్న ఈ బిల్లు లక్ష్యమేమిటి? ఐదు సంవత్సరాలు, అంతకు మించి జైలుశిక్షకు అర్హమయ్యే నేరాభియోగాలతో అరెస్టయిన మంత్రులు (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సైతం) జైలులో 30రోజులు ఉంటే పదవీచ్యుతులు అవుతారు. ఆ ముప్ఫై రోజులలో దర్యాప్తు పూర్తికావడం అసాధ్యం. చార్జిషీటును దాఖలు చేయడమూ జరిగే పని కాదు. ఆరోపణలు ఉండవు, విచారణ జరగదు, శిక్ష నిర్ధారణ కాదు. అయినప్పటికీ 31వ రోజున 'నేరస్తుడు' అనే కళంకంతో పదవిని కోల్పోతాడు! ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ, రాజకీయ నైతికతకు పరాకాష్ఠ అని భారతీయ జనతా పార్టీ ఘోషిస్తోంది. ఏమిటి ఆ పార్టీ వాదన? 'అవినీతిపరుడు' అయిన ఒక మంత్రిని పదవి నుంచి తొలగించడం కంటే ఉన్నతాదర్శం మరేముంటుంది? ఒక మంత్రి (లేదా ముఖ్యమంత్రి) జైలు నుంచి పరిపాలన చేయవచ్చా? చెప్పవచ్చిన దేమిటంటే బీజేపీ దృష్టిలో ఈ బిల్లును సమర్థించే వారు నిజమైన దేశభక్తులు, జాతీయవాదులుబీ వ్యతిరేకించే వారు జాతి వ్యతిరేకులు, అర్బన్ నక్సల్స్, పాకిస్థానీ ఏజెంట్లు.ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నేర విచారణ చట్టం అమలవుతున్న తీరు తెన్నులు తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. న్యాయం సమకూరడమనేది సందేహాస్పదమవుతోంది. ఎందుకో చూద్దాం: జీఎస్టీ చట్టాలతో సహా అన్ని చట్టాలను రాజకీయ ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నారుబీ (కానిస్టేబుల్‌తో సహా) ఏ పోలీసు అధికారి అయినా వారంట్‌తోనో లేక వారంట్ లేకుండానో ఏ వ్యక్తినైనా అరెస్ట్ చేయవచ్చు... కేసు పెట్టదగిన నేరానికి పాల్పడినట్టు ఎవరిపైన అయినా సహేతుకమైన అనుమానం ఉంటే సదరు వ్యక్తిని అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉన్నదిబీ 'బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు' అని జస్టిస్ కృష్ణయ్యర్ ధర్మ ప్రవచనం చేసినప్పటికీ ట్రయల్ కోర్టులు బెయిల్ మంజూరు చేసేందుకు ఇష్టపడడం లేదుబీ ప్రథమ విచారణలో హైకోర్టులు బెయిల్ మంజూరు చేయవు. ఏదో ఒక సాకుతో బెయిల్ ఇవ్వకుండా విచారణ కొనసాగించి, 60%-%90 రోజుల అనంతరం బెయిల్ మంజూరు చేయడం పరిపాటిగా ఉన్నదిబీ ఈ శోచనీయ వ్యవహారాల ఫలితంగా దేశ సర్వోన్నత న్యాయస్థానంలో రోజూ డజన్ల కొద్దీ బెయిల్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే సుప్రీంకోర్టు సైతం ట్రయల్ కోర్టు విధులు నిర్వర్తించవలసి వస్తోందిబీ 130వ రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రధానమంత్రిని కూడా చేర్చడం హాస్యాస్పదం. ఏ పోలీసు అధికారీ ప్రధానమంత్రిని అరెస్ట్ చేసేందుకు సాహసించడు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయేలా చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇండియా కూటమి, తృణమూల్ కాంగ్రెస్ సులువుగా కూడగట్టుకోగలుగుతాయి. అయినప్పటికీ ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం ఖాయమనే ఆత్మ విశ్వాసంతో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నది. ఉభయ సభలలోను కొన్ని ప్రతిపక్షాల లేదా ఎంపీల మద్దతు పొందగల ఉపాయమేదో ప్రభుత్వానికి ఉన్నట్టుగా ఉంది. బహుశా, ఓటింగ్ రోజున కొంత మంది విపక్ష ఎంపీలు 'అదృశ్యమయ్యే' చాణక్యానికి ప్రభుత్వం పాల్పడవచ్చు. లేదూ, ఇంకేదైనా వ్యూహం ప్రభుత్వానికి ఉన్నదేమోగానీ అది నా అవగాహనకు మించినది.ఈ బిల్లు విషయమై ప్రధానమంత్రి, హోంమంత్రి ఇప్పటికే సమర నాదాలు చేశారు. అది తప్పక పార్లమెంటు ఆమోదం పొందుతుందని ఘంటాపథంగా చెబుతున్నారు. సరే, 'విధేయ' మీడియా వారి మాటలు, వాదనలు వల్లె వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు బిహార్ (2025), అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (2026) ముగిసేంతవరకు ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై జాయింట్ సెలెక్ట్ కమిటీ ఎటువంటి నిర్ణయం తీసుకోదు. మీడియా వార్తల ప్రకారం 2014 నుంచి ప్రతిపక్షాలకు చెందిన 12 మంది మంత్రులను అరెస్ట్ చేశారు. వారిలో చాలా మందికి నెలల తరబడి బెయిల్ మంజూరు కాలేదు.

## ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టులు

మొదటిపేజీ తరువాయి

ములుగు క్రైం: ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సమక్షంలో శనివారం నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు లొంగిపోయారు. జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సంయుక్తంగా "పోరు కన్నా ఊరు మిన్న – మన ఊరికి తిరిగి రండి" పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాల గురించి వివరిస్తున్నారు. వీటి గురించి తెలుసుకున్న నిషేధిత మావోయిస్టు పార్టీలో వివిధ హోదాలలో పనిచేస్తోన్న నలుగురు మహిళలు సహా ఏడుగురు సభ్యులు నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఎస్పీ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఏరియా కమిటీ సభ్యుడు తాటి ఉంగి, ముగ్గురు పార్టీ సభ్యులు కొడ్మే సుక్కు, పోడి భీమ్, కుంజం వరలక్ష్మి, పద్మం మరో ఇద్దరు ఉన్నారు.

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. బాసర ఆలయం వరకు వరద నీరు

మొదటిపేజీ తరువాయి

వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలన్నీ నీట మునిగాయి. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు చిక్కుకున్నారు. వరద చుట్టుముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

## తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ– అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ– హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు–, ఇటీ–వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు.పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు– ఈ సారి అమిర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమిర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం అన్నారు. గోలల పాలసీ విధి విధానాలపై చర్చించాం. 2022 – 23 లో రబీ ధాన్యం సేకరణకు టెండర్లు పిలిచారు. మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదు.. వారి పై పీడీ యాక్ట్ పెట్టడాని–కై–నా ప్రభుత్వం వెనకాడదు. మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇంచార్జిలను నియమించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు.

## పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు– వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లీకి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండని విజయశాంతి అన్నారు.

## రెండు రోజులంటే ఎలా

మొదటిపేజీ తరువాయి

వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు– గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు– రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటి పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటు–ంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీ–ఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. పీపీటీకి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు చేశారు. రేపు ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు– కూడా లేదు. ఎరువుల మీద చర్చించడానికి, వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా..? ఎజెండా నిర్ణయించకపోవడమేనా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

## రవీంద్రభారతిలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ.. హాజరైన ప్రముఖులు




హైదరాబాద్: రవీంద్రభారతిలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు.

### సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు: విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు.

### సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ఒక పాఠం: డి.రాజా

నిస్వార్థంగా ప్రజల కోసమే జీవించడం ఎలాగో సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాన్ని చూస్తే అర్థమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రతి రాజకీయ నాయకుడికి ఆయన జీవితం ఒక పాఠంగా నిలుస్తుందని చెప్పారు. సురవరం పాటించిన సిద్ధాంతాలు సీపీఐ మాత్రమే కాదు.. అన్ని పార్టీల నేతలకు ఆదర్శవంతమన్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటమే కాదు.. ప్రజల స్వేచ్ఛ కోసం పోరాటాలు చేయాలని ఆయన భావించారు.

### సురవరం గొప్ప ప్రజాస్వామికవాది: బీవీ రాఘవులు

దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరాటాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేశారు: మహేశ్‌కుమార్ గౌడ్

తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

## కేపీహెచ్‌బీలో దారుణం.. భర్త గొంతు కోసి.. ఆపై ఆత్మహత్యకు యత్నించిన మహిళ



హైదరాబాద్: నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. అప్పుల బాధ తాళలేక చనిపోదామని దంపతులు నిర్ణయించుకున్నారు. మొదట భర్త రామకృష్ణ గొంతు కోసి అతడి భార్య చంపేసింది. అనంతరం తానూ గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రమ్యకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పదవీ విరమణ చేసిన, కొత్త బాధ్యతలు స్వీకరించిన అధికారులకు టీజేఏసీ అభినందనలు.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 30**
పశుసంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందిన డా. టీ సుధాకర్ , డిపార్ట్మెంట్‌లో వివిధ హోదాలలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన మహమ్మద్ యునెస్, ధర్మరాజు ని టీజేఏసీ పక్షాన ఘనంగా అభినందించారు. పశు సంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన లింగారెడ్డి , స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్‌లో పదోన్నతి పొందిన జోయల్ ని టీజేఏసీ సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధికారులు తమ సేవల ద్వారా శాఖలకు విశిష్ట గుర్తింపు తెచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారు కూడా అదే విధంగా కృషి చేసి శాఖ ప్రతిష్టను మరింత ఎత్తుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నాంమని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవిలో చేరిన రోజే తన పదవీ విరమణ రోజూ నిర్ణయమవుతుందనీ,30-35 సంవత్సరాలపాటు క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వర్తించి, ఎలాంటి క్రమశిక్షణా చర్యలు లేకుండా పదవి విరమణ పొందడం గర్వకారణం అని , రిటైర్ అవుతున్న సహచరులు ప్రభుత్వ సేవలో చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయనీ,ఇకపై ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందకర జీవితం గడపాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ,జేఏసి కన్వీనర్ మడిపేల్లి కాళీచరణ్, గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి అరవింద్ రెడ్డి, టీఎన్జీవోలు సంఘం జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, కేంద్ర సంఘ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాల్గవ తరగతి సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, నాయకులు గిరిధర్ రావు, కమలాకర్, హరిప్రియ విజయలక్ష్మి అభిషేక్ రెడ్డి పోచయ్య రాజిరెడ్డి అల్లె శ్రీనివాస్, వంశీ, తిలక్, రాజేశ్వరరావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్చరీ విజేత చికితకు ఘన స్వాగతం పలికిన భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ.




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 29.**
కెనడాలో ఈనెల 17 నుంచి 24 వరకు జరిగిన ప్రపంచ ఆర్చరీ పోటీలో స్వర్ణ పతాకం సాధించి మొదటిసారిగా శనివారం కరీంనగర్ వచ్చిన సందర్భంగా ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు మాట్లాడుతూ చికిత ప్రపంచ స్వర్ణం సాధించడం తెలంగాణకే కాదు మన దేశానికి గర్వకారణమని అని గొప్ప బిడ్డ ను కన్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోయే కాలంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు తాటి పెల్లి సతీష్ బాబు రాజ్ కిరణ్ మల్యాల వేణుగోపాల్ చికిత్స తండ్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత అవకాశాలపై అవగాహన.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
ఆస్ట్రేలియాలోని ఉన్నత విద్యా అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో. బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బి వి ఆర్ ఐ టి.లో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన సదస్సు ను నిర్వహిస్తున్నట్లు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే గారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ గ్లోబలీకరణలో విద్యార్థులు ఎలా ఉన్నత విద్యను ఉద్యోగ అవకాశాలు ఉంటాయ్ తెలియచేసుందుకు తమ కళాశాలలో ఆస్ట్రేలియా విద్యావేత్తలతో విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా "ఆస్ట్రేలియా దేశానికీ చెందిన ప్రొఫెసర్ బెన్ అరాచి", లీడర్స్ ఇన్స్టిట్యూట్, డైరెక్టర్, బ్యాచిలర్ ఆఫ్ అకౌంటింగ్ మరియు డిప్లొమా ఆఫ్ కామర్స్ ప్రోగ్రామ్ ,ఆస్ట్రేలియా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ " ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్లోని లీడర్స్ ఇన్స్టిట్యూట్ అందించే వివిధ విద్యా ప్రోగ్రామ్ల గురించి ప్రొఫెసర్ బెన్ వివరించారు. %వీదీూ% అగ్రి బిజినెస్ మరియు మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ అగ్రికల్చరల్ బిజినెస్ గురించి ప్రొఫెసర్ బెన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆస్ట్రేలియా యొక్క ముఖ్యాంశా లైన పుష్కలంగా ఉద్యోగాలు, అధిక జీవన నాణ్యత, ఆయుర్దాయం ఎక్కువ, మానవ అభివృద్ధి సూచికలో ప్రపంచంలో 5వ స్థానం, ప్రపంచంలో




వివిధ ప్రాంతాలలో వాతావరణ మార్పు గురించి , ఆస్ట్రేలియా వాతావన మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఆస్ట్రేలియాలో చాలా భూమి ఉంది, ఎక్కువగా పొడిగా ఉంటుంది మరియు పుష్కలంగా పచ్చదనం ఉంటుంది, అయితే భారత ఉపఖండంలో తడి భూమిగా ఉన్న చాలా భూమి నీటి నిల్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నందున రోజురోజుకూ ఎండిపోతోందని మనం చూస్తున్నామని అందువల్ల, పర్యావరణాన్ని రక్షించడం మరియు ప్రకృతిని కాపాడుకోవడం మన నైతిక బాధ్యత అని భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని నిలబెట్టడం - వ్యవసాయ వ్యాపారం మరియు ఆర్థిక శాస్త్రంపై ప్రపంచ సరళీకరణలు ఎలా ఉంటాయో వివరించారు. ఆస్ట్రేలియాలోని లీడర్స్ ఇన్స్టిట్యూట్లో అక్కడి ఉన్నత విద్య యొక్క విలువు ఉద్యోగ వేతనాల ప్యాకేజీ భారత



విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలు మేనేజ్మెంట్ కోర్సుల ప్రాధాన్యతలు ప్రపంచ స్థాయి మౌలిక వసతులు సదుపాయాల గురుంచి విద్యార్థులకు వివరంగా వివరించారు.ఇంజనీరింగ్ కాలేజీ . డైరెక్టర్ డాక్టర్ K.లక్ష్మీ ప్రసాద్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సదస్సుల ద్వారా ప్రపంచ విద్యఉద్యోగ అవకాశాల గురుంచి తెలుసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధిగా శ్రీ విష్ణుఎడ్యుకేషనల్ సొసైటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ ఎడ్ల రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జి ఎస్ ఏ కోఆర్డినేటర్ శ్రీమతి ప్రణిత, ఎంబీఏవిభాగం హెచ్ఓడి డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు మరియు ఇతర అధ్యాపకులు హాజరయ్యారు. వివిధ విభాగ అధిపతులు, హెచ్ ఓ డి ఎస్.డీన్స్, ఫాకల్టీ మెంబర్స్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల మేనేజర్ శ్రీ బాపిరాజు గారు, టి ఎల్ ఎన్.సురేష్, ఏవో.ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

# రాజన్న ఆలయ నూతన ఈవోగా రమాదేవి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవోగా రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ కాగానే రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు





నిర్వహించారు. దర్శనమనతరం ఆలయ అర్చకులు కళ్యాణ మండపంలో వేదొక్త ఆశీర్వచనం అందించగా, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి శ్రవణ్ కుమార్ స్వామి వారి చిత్రపటం తో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ వెల్ది సంతోష్, వి.వెంకట ప్రసాద్,ఎం.రాజేందర్, ఒన్నారం భాస్కర్, బొడుసు మహేష్ ఆలయ వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులను వేధిస్తే సహించేది లేదు



- శ్రీ చైతన్యస్కూల్ నిర్వాహకులకు వార్నింగ్
- పెద్దపల్లి డిఈవో కు నివేదిక అందజేస్తా
- రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 30:**
రామగుండం మండలం ఆర్ఎఫ్సిఎల్ టౌన్ షిప్ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ను రామగుండం ఎంఈఓ జింక మల్లేశం శనివారం తనిఖీ చేశారు. వివాదాలకు నిలయంగా ఉన్న టెక్నో స్కూల్, నిర్వాహకులు ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరు, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో పత్రికలలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వ్యవహారంపై వార్తలు రావడంతో, ఎంఈఓ మల్లేశం స్పందించారు. శనివారం ఆకస్మికంగా పాఠశాలను సందర్శించి పాఠశాల రికార్డ్స్, ఫీజుల వివరాలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల వివరాలు, పాఠశాల విద్యా బోధన తదితరు అంశాలను నిర్వాహకులు ఉపాధ్యాయుల నుండి అడిగి తెలుసుకున్నారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ఎంఈఓ కు అనేక ఫిర్యాదులు చేశారు, అధిక ఫీజులతోపాటు, పాఠశాలలో చదువు చెప్తున్నా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని, ఎంఈఓ దృష్టికి తీసుకువెళ్లారు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను మానసిక వేదనకు గురి చేసే విధంగా వ్యవహరించడమే కాక, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వాహకులకు చెప్పేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వస్తే కూడా, కేర్ లెస్ గా చూస్తూ, అవమానిస్తున్నారని ఎంఈఓ దృష్టికి తీసుకువెళ్లారు, పదో తరగతి చదువుతున్న విద్యార్థులను మరింత కృంగదీసే విధంగా అర్థాంతరంగా మధ్యలో విద్యార్థులను సెక్షన్స్ మారుస్తున్నారని, రెండు సెక్షన్లలో 15 నుండి 20 మందిని సపరేట్ గా, చేసి వారిపై అధిక సబ్జెక్టుల భారం వేస్తూ, చదవాలంటూ ఒత్తిడి తీసుకు వస్తున్నారని విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు వివరించారు, ఈ సందర్భంగా ఎంఈఓ మల్లేశం మాట్లాడారు. ఆర్ఎఫ్సిఎల్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో, పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు వాస్తవమేనని మీడియాకు వివరించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ సమానమేనని తారతమ్య భేదం లేకుండా అన్ని వర్గాలకు విద్యను అందించాలని, టెక్నో స్కూల్లో పూర్తిస్థాయి విచారణ చేయడం జరిగిందని, పాఠశాలలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల జరుగుతున్న అనేక విషయాలను, డీఈవో దృష్టికి తీసుకువెళ్లి నివేదిక ఇస్తానని వెల్లడించారు, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయుల కొంతమంది, తమ విధానాలు మార్చుకోకపోతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఎంఈవో మల్లేశం హెచ్చరించారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణపతి పాటను ఆవిష్కరించిన పారమిత విద్యాసంస్థల చైర్మన్ .



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 30**
గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న కిట్ల చరణ్ ఆలపించి , నటించిన ఎలుక మీద రావయ్యా ఓ గణపయ్యా అనే గీత పోస్టర్, యూట్యూబ్ మాధ్యమంలో పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు. చరణ్ చిన్నప్పటి నుండి తన తండ్రి కిట్ల శ్రీనివాస్ ప్రోత్సాహంతో సంగీత సాధన చేస్తున్నాడు. తనకు సంగీతం పై ఉన్న మక్కువ వల్లనే తను సంగీతంలో అద్భుతంగా రాణిస్తూ పాటలకు చక్కటి సంగీతాన్ని అందించ గలుగుతున్నానని చరణ్ తెలిపాడు. ఈ సందర్భంగా 7వ తరగతి లోనే పాటలకు చక్కటి సంగీతాన్ని అందించిన చిన్నారి చరణ్ ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు, డైరెక్టర్స్ టి.యస్.వి.రమణ, హన్మంత రావు, విద్యార్థి తండ్రి కిట్ల శ్రీనివాస్, పి.డి. రామానంద తీర్థ లు అభినందించారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం

## - చిన్నపిల్లలకు స్వయంగా అన్నం వడ్డించిన సీపీ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 30:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంకు పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ లతో కలిసి పాల్గొని సీపీ స్వయంగా (మంథని డివిజన్ హ్యాండ్ క్యాఫ్డ్ వెల్ఫేర్ సొసైటీ), బాలల సంరక్షణ ఆశ్రమం, గోదావరిఖని, లోని పిల్లలకి భోజనం వడ్డించి వారితో కలిసి అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్ బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ,




మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఏఓ శ్రీనివాస్, వివిధ విభాగల ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్,మల్లేశం, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, సీపీఓ, వివిధ పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ పనిని రద్దు చేయండి

## - ఆలయ ఈవోకు బిజెపి నాయకుల వినతి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా భీమేశ్వరాలయంలో చేపట్టిన పనులను అన్యమతస్తులచే చేయించడమే కాకుండా, చెప్పులు వేసుకుని గుడి లోపల పనులు చేయడాన్ని నిరసిస్తూ శనివారం బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు ఆలయ ఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఈవో రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ భీమన్న గుడిలో చెప్పులు వేసుకొని అభివృద్ధి పనులు చేయడాన్ని బిజెపి పట్టణ శాఖ తరపున ఖండిస్తున్నామని, హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన కాంట్రాక్టర్ పనిని రద్దు చేయాలని, మునుముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, హిందూ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 31 2025

# పోస్టర్ ఆవిష్కరణ

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**



2004 సెప్టెంబర్ ఒకటి నుండి అమలులోకి వచ్చినటువంటి కొత్త పెన్షన్ విధానం ఉద్యోగుల, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, కొత్త పెన్షన్ విధానం రద్దు కొరకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు సెప్టెంబర్ 1 న నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘు శంకర్ రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయ పెల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పాత పెన్షన్ రద్దు పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఎస్ మహమ్మారిని రద్దు చేసినతరకు ప్రభుత్వంపై పోరాటం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానందం, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నారాయణరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్, మంగళగిరి చక్రపాణి, పర్శ రాములు , దేశెట్టి మల్లేశం, ఎలగందుల శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్,ఐలయ్య పాల్గొన్నారు.

## జమ్మికుంట సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 30**



జమ్మికుంట మున్నూరు కాపులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ పరంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య అన్నారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో నియోజకవర్గ మున్నూరు కాపు ప్రతినిధుల తో సమావేశము మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు ఏ బూసి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సభ్యత్వ నమోదు పుస్తకాలను ఆ సంఘ నియోజకవర్గ ఇన్చార్జ్ ముప్పిడి సునీల్ అందజేశారు. ఈ సందర్భంగా పొనగంటి మల్లయ్య మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు తమ మండలంలోని అన్ని గ్రామాల మున్నూరు కాపు కుల పెద్దలను సమన్వయం చేసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీనియర్ నాయకులు ఆకుల రాజేందర్, సాయిని రవి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాజేందర్, పొన్నగంటి రవికుమార్, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు అ ప్పాల రమేష్, వీణవంక మండల అధ్యక్షులు పురం శెట్టి చేరాలు, హుజురాబాద్ మండల అధ్యక్షులు ఆకుల సదానందం, రాష్ట్ర నాయకులు కూరగాయల తిరుపతి, పొనగంటి విష్ణు ,కందుల సందీప్ తదితరులు పాల్గొన్నారు

## జమ్మికుంట సోమిడి జయలక్ష్మిని అభినందిస్తున్న ఎం ఈ ఓ

- పాఠశాలకు గ్రిల్స్ పెట్టించిన పాఠశాల హెచ్ఎం సోమిడి జయలక్ష్మి

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 30**



కరీంనగర్ పట్టణానికి చెందిన సోమిడి జయలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు కొత్తపెల్లి మండలం లోని ఆసిఫ్ నగర్ ఎస్సీ కాలనీ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారి అమ్మ మంద చంద్రమ్మ జ్ఞాపకార్ధంగా ఆ పాఠశాలలో కూర్చోవడానికి విద్యార్థులకు బెంచీలు లేకపోవడంతో, విద్యార్థుల సౌకర్యార్థం తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి 10 డెస్క్ బెంచీలు, 4 కుర్చీలు, కోతులు లోపలికి రాకుండా ఐరన్ గ్రిల్స్ ఆ పాఠశాలలో హెచ్ ఎం గా పనిచేస్తున్న సోమిడి జయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తుమ్మ ఆనందం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారు ఇబ్బంది పడకుండా ఉండడానికి, తన వంతు శాయము చేశానని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమల మనోహర్, గ్రామ అంబేద్కర్ యూత్ అధ్యక్షులు అరుణ్, సి ఆర్ పి పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దాహాం చేసిన బిజెపి నాయకులు

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 30**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి పైన నిన్న బీహార్ లో జరిగిన ఒక సభలో అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా జమ్మికుంట గాంధీ చౌరస్తా లో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు, ఈసందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రతిపక్ష నేతగా ఉండి, బీహార్ లో దొంగ ఓట్లు అంటూ ఓ దొంగ యాత్ర చేపడుతున్నారని, ఆ యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ ఒక సభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి స్వర్గీయ హీరాబెన్ పై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు దేశ మాతృమూర్తులందరిని భాదించాయని, వెంటనే రాహుల్ గాంధీ ఆ వ్యాఖ్యలను వెనక్కి



తీసుకొని దేశంలోని మహిళలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, పదకొండు సంవత్సరాల మోడీ సుపరిపాలన చూస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, మోడీ ప్రభుత్వం పై చిన్న తప్పును చూపలేని అయోమయంలో రాహుల్ గాంధీ దేశంపై, మోడీ తల్లి పై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు, రాజకీయం చేయడం రాకపోతే, రాహుల్ గాంధీ ఇప్పటికైనా వారసత్వ రాజకీయాల నుంచి తప్పుకొని యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు ఈకార్యక్రమంలో రాజేష్ ఠాకూర్, కైలాసకొటి గణేష్, పల్లపు రవి, బచ్చు శివన్న, ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, గిరవేన విజేందర్, పత్తి జనార్ధన్ రెడ్డి, బూరుగుపల్లి రాము, ఆకుల పోచయ్య, శ్రీవర్తి అఖిల్, కొమ్ము అశోక్, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, కురిమిల్ల అశోక్, గట్టు రాకేశ్, ఆవాంచ వెంకటేష్, మ్యాదరి శంకర్, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీలో భారీ చేరిక 100 మందితో. జిల్లా అధ్యక్షుడు రాధా బాల్దాస్ మల్లేష్ గౌడ్.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణం చైతన్యపురి కాలనీకి చెందినవారు,దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టినటువంటి పథకాలకు ఆకర్షితులై అదేవిధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ రామచంద్రరావు గారి నాయకత్వాన్ని బలపరుస్తూ మరియు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు . అభివృద్ధి పనులు చూసి చైతన్యపురి కాలనీ రాణి మరియు రాజు . ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బిజెపి పార్టీలో మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ చేతుల మీదగా బీజేపీ లో చేరడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్ ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ రాష్ట్ర నాయకులు పాపగారి రమేష్ గౌడ్ మెదక్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి గారు,నాగరాజు ,జిల్లా కార్యదర్శి బాలరాజు ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్ ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గుండం శంకర్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు చంద్రయ్య నర్సాపూర్ మండల్ బిజెపి పార్టీ అధ్యక్షులు నీలి నాగేష్ నర్సాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘసాని రాజు రామ్ రెడ్డి నర్సాపూర్ పట్టణ ఉపాధ్యక్షులు మహేందర్ గౌడ్ ,నర్సాపూర్ పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షులు బబ్బురి కృష్ణ గారు బీజేవైఎం నాయకులు అర్వింద్ వాల్దాస్ బీజేవైఎం మండల్ అధ్యక్షుడు రాజేష్ బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ బిజెపి నాయకులు ఈశ్వర్ ,బీజేవైఎం నాయకులు శ్యామ్ గౌడ్ అనిల్ బండి వేణు మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# గణేష్ నిమజ్జనానికి పగడ్బందీగా ఏర్పాట్లు కలెక్టర్ రాహుల్ రాజ్

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**

జిల్లాలో నిండుకుండలా చెరువులు గణేష్ నిమజ్జన భక్తులు సమన్వయం పాటించాలి పోలీస్ రెవిన్యూ, పంచాయతీ మున్సిపాలిటీ అధికారుల సలహాలు సూచనలు పాటించాలి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం జరిపేందుకు అవసరమైన ఏర్పాటను పగడ్బందీగా చేపట్టాలని జిలా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస్ రావు తో కలిసి వినాయక నిమజ్జనం జరిగే మెదక్ మండలం కేంద్రంలో కోమటూరు చెరువును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం పాయింట్ల వద్ద రక్షణ కంచెలు, లైటింగ్, క్రేన్లు,



ఏర్పాటు చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, విద్యుత్ అంతరాయం కలిగినట్లయితే ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లను ఏర్పాటు



చేయాలన్నారు. ప్రతి ఘాట్ వద్ద పోలీస్, మున్సిపల్ సిబ్బంది, గజఈతగాల్లతో పాటు వాటంటీర్లను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మణ్ బాబు,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్, సిఐ రాజశేఖర్ రెడ్డి, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అందోలులో దంచికొట్టిన వానలు..



- దెబ్బతిన్న రహదారులు
- నీట మునిగిన పంటలు
- ఎక్కడ చూసిన వరద విలయమే

**కరపత్రం ప్రతినిధి అందోలు**

గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని చెరువులు కుంటలు అలుగు పారుతుండగా పంట పొలాలు నీట మునిగాయి. అలాగే గ్రామస్థాయి రోడ్లు జలమయమై దెబ్బతిన్నాయి. సింగూర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో మంజీరా నది ఉప్పొంగడంతో గ్రామాలలోని పలు పంట పొలాలు, అందోల్, రాయికోడ్, రేగోడ్, టేక్మాల్ మండలలలోని చాలా





వరకు రహదారులు జలమయమయ్యాయి.



జోగిపేట నుండి మసానిపల్లి, డాకూర్, అలాగే డాకూరు నుండి బ్రహ్మణపల్లి చౌరస్తా అక్కడి నుండి తాలెల్మ మీదుగా వట్టిపల్లి మండల కేంద్రం వరకు అక్కడక్కడా రోడ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ రహదారులలోఎంతోమంది ప్రమాదాల బారినపడి ఆసుపత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి దెబ్బతిన్న రోడ్ల మరమత్తు కోసం సంబంధిత ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.